

నవభూమి

కరీంనగర్

అనుబంధం

20 సెప్టెంబర్,2024 శుక్రవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


## సమర యోధుల త్యాగాలను

# స్మరించుకుందాం



**కరీంనగర్,–నవభూమి:** ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రిబండి సంజయ్‌కుమార్ అన్నారు. నగరంలోని టీఎన్జీవోస్ భవనంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యునికేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి చేసేందుకు జరిగిన పోరాటల చరిత్రను స్మరించుకునే అవకాశం ఈ ఎగ్జిబిషన్ ద్వారా కలుగుతుందన్నారు. బైరాన్‌పల్లి సంఘటన, రజాకార్ల అకృత్యాలతోపాటు సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలో ఆపరేషన్ పోలో నుంచి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కలిగించిన ప్రధాన సంఘటనలను ఎగ్జిబిషన్‌లో కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ప్రతి ఏటా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్‌లో పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన అరుదైన చిత్రాలు మూడు రోజులపాటు అందుబాటులో ఉంటాయని, ప్రజలు వీక్షించాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అధికారి సూరునేని శ్రీధర్, ఎన్‌వైకే జిల్లా అధికారి ఎం వెంకటరాంబాబు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.కరీంనగర్ ఐటీఐలో రాష్ట్రంలో తొలి ఏఆర్, వీఆర్ ల్యాబ్ రాష్ట్రంలో తొలి ఏఆర్, వీఆర్ (అగ్‌మెంటెడ్ రియాలిటీ, వీడియో వర్చువల్ రియాలిటీ) ల్యాబ్‌ను కరీంనగర్ ఐటీఐలో ప్రారంభించామని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని ఐటీఐ కళాశాలలో ల్యాబ్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేషనల్ ఇన్‌స్ట్రక్షనల్ మీడియా ఇన్‌స్టిట్యూట్ (నిమి) ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ ల్యాబ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొట్టమొదటగా కరీంనగర్ ఐటీఐ కళాశాలలో ఏఆర్, వీఆర్ పద్ధతిలో వివిధ కోర్సులకు సంబంధించిన బోధన ప్రారంభమైందన్నారు. ఐటీఐ విద్యార్థులు తమ కోర్సులను ఏఆర్, వీఆర్ ల్యాబ్ ద్వారా లైవ్‌లో నేర్చుకోవచ్చున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సేవాపక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా ఎంపీ ల్యాడ్స్ ద్వారా ఏఆర్, వీఆర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఐటీఐ కళాశాలలో ఉన్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. ప్రధాని మోదీ స్కిల్ డెవలప్‌మెంట్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. విద్యార్థులు ల్యాబ్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు.

# రహదారి విస్తరణకు మార్గం సుగమం



2

## 15రోజుల్లో లాభాల

# వాటా ఇప్పిస్తాం..



**గోదావరిఖని, –నవభూమి:** రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రానున్న 15 రోజుల్లో సింగరేణి కార్మికులకు లాభాల వాటా అందేలా చూస్తా మని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి తెలిపారు. బాయిబాట కార్యక్రమంలో బుధవా రం జీడీకే సీఎస్‌పీ–1లో గేట్ మీటింగ్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడు తూ కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని, పెర్క్స్‌పై విధించే ఇన్‌కంటాక్స్‌ను రద్దు చేయిస్తా మని ఆయన కార్మికులకు హామీఇచ్చారు. ఈ గేట్ మీటింగ్‌లో కేంద్ర నాయకులు టైసన్ శ్రీనివాస్, గడ్డం కృష్ణ, మండ రమేష్, పుట్ట రమేష్, మల్లికా ర్జున్, ఏ శ్రీనివాస్, నాగరాజు, సాగర్, శంకర్, జగ న్, ఆంజనేయులు, నయీం పాల్గొన్నారు.మెరుగైన లాభాల వాటా ఇప్పించేందుకు కృషి..యైటింక్లయిన్‌కాలనీ : కార్మికులకు మెరుగైన లాభాల వాటా ఇప్పించేలా ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని యూనియన్ సీనియర్ వైస్ ప్రెసిడెం ట్ నర్సింహారెడ్డి తెలిపారు. బుధవారం ఓసీపీ–3 కృషి భవన్, బేస్ వర్క్‌షాప్‌లలో జరిగిన గేట్‌మీ టింగ్‌లలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమ యంలో కార్మికులకు ఇచ్చిన హామీల్లో కొన్ని అమ లుచేశామని, మిగిలినవి అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళనున్నట్టు తెలిపారు. పెర్క్స్ మీద ఐటీ రీయింబర్స్, స్వంత ఇంటి పథ కం అమలు, మహిళా ఉద్యోగినులకు పని స్థలా ల్లో రక్షణ కల్పించడం, పని స్థలాల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. 15రోజుల్లో లాభాల వాటా చెల్లించే లా యూనియన్ పక్షాన యాజమాన్యంతో చర్చ లు జరుపుతున్నట్టు తెలిపారు. కార్మికుల సంక్షే మం, రక్షణకు పెద్దపీట వేసేలా పనిచేస్తుందని అన్నారు. ఐఎన్‌టీయూసీ సాధించిన పనులను తాము చేసినట్టు ఇతర యూనియన్లు ప్రచారం చేసుకోవడానికే పరిమితమయ్యాయని, కార్మికుల పక్షాన నిలవాలనే స్పృహ లేకుండా పోయిందని విర్శించారు. ఈ గేట్ మీటింగ్‌లో యూనియన్ జనరల్ సెక్రెటరీ అక్రం, నాయకులు లక్ష్మీపతి గౌడ్, సంపత్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, ఎట్టెం కృష్ణ, సీ హెచ్ ప్రసాద్, మార్కండేయ, దశరథం, సలిగం టి రాములు, లక్ష్మణరావు, బర్ల రవీందర్, కనక య్య, అవినాష్, ఉస్మాన్ పాల్గొన్నారు.

# పర్యావరణహిత అడుగులు




3

## పవర్ లిఫ్టింగ్‌లో రికార్డు




**సింగరేణి –నవభూమి:** బరువులెత్తుతున్న క్రీడాకారుడు శ్రీనివాసరెడ్డి గనిలో కోల్ కట్టర్‌గా పనిచేస్తున్న కరీంనగర్ వాసి సుంకరి శ్రీనివాసరెడ్డి..పవర్ లిఫ్టింగ్‌లో ఇప్పటివరకు కోలిండియా, సింగరేణిలో నమోదై ఉన్న రికార్డులను బద్దలు కొట్టాడు. సింగరేణి పవర్ లిఫ్టింగ్ పోటీలు మంగళ, బుధవారాల్లో జరిగాయి. ఇందులో శ్రీనివాసరెడ్డి ఏకంగా 250 కిలోల బరువు ఎత్తి.. రికార్డు నెలకొల్పారు. కోలిండియాలో ఇప్పటివరకు అత్యధిక రికార్డు 245 కిలోలుగా నమోదై ఉంది. ఇదే కాకుండా స్క్వాడ్‌లో 242, బెంచ్ ప్రెస్‌లోనూ 125 కిలోల బరువు పైకెత్తి రికార్డు నమోదు చేయడం విశేషం.'మిస్టర్ తెలంగాణ'గా పేరు..కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన సుంకరి శ్రీనివాసరెడ్డి 2015లో జయశంకర్ భూపాలపల్లి ఏరియాలో సింగరేణి ఉద్యోగిగా చేరారు. 2018 నుంచి బాడీ బిల్డింగ్, 2023 నుంచి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటూ.. వరుస విజయాలతో దూసుకెళ్తున్నాడు. 2019లో బాడీ బిల్డింగ్‌లో 'మిస్టర్ సింగరేణి' టైటిల్ కైవసం చేసుకున్నాడు. 2022లో హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో 'మిస్టర్ తెలంగాణ'గా నిలిచాడు. 2023, 2024లోనూ స్వర్ణ పతకాలు సాధించాడు.స్ట్రాంగ్‌మెన్ టైటిల్ సాధించడమే లక్ష్యం..ఏ సింగరేణి క్రీడాకారుడికైనా కోలిండియాలో పతకాలు సాధించడమే లక్ష్యమన్నారు. స్ట్రాంగ్‌మెన్ టైటిల్ సాధించాలనుందని వెల్లడించారు. గతేడాది కొద్ది తేడాతో ఆ స్థానం చేజారిందని.. ఈసారి తప్పకుండా రాణిస్తానన్నారు. పోటీల్లో రాణించేందుకు యాజమాన్యం ప్రోత్సాహమే ముఖ్య కారణమని తెలిపారు.

## నిధులు రావు వృథా ఆగదు



**సిరిసిల్ల –నవభూమి:** షట్టర్ల నుంచి వృథాగా పోతున్న నీరు ఈ ఏడాది వర్షాకాలం సీజన్ ప్రారంభమైన మూడు నెలల వరకు సమృద్ధిగా వర్షాలు లేక జలాశయాలకు నీరు చేరలేదు.పంటలకు సాగునీటి విడుదలపై అప్పటి వరకు అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల మొదటి వారం అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని భారీ, మధ్య, చిన్నతరహా జలాశయాలన్నీ నిండుకుండలా మారాయి. పురాతన జలాశయం నర్మాలలోని ఎగువమానేరు కుడికాల్వ షట్టర్ల లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. ఇదొక్క జలాశయంలోనే కాదు. నిమ్మపల్లి, నక్కవాగు, చంద్రవంక జలాశయాల్లోనూ తూములు, కాల్వల షట్టర్ల వద్ద దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది.జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.36 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అందులో వరిసాగు విస్తీర్ణం 70 శాతం పైన ఉంది. ఇటీవల వర్షాలకు మెట్టప్రాంతమైన జిల్లాలో 2.14 మీటర్ల మేర భూగర్భజలాలు పైకి వచ్చాయి. సగటున 8.15 మీటర్లలో భూగర్భ జలాలున్నాయి. ప్రధానంగా వరి పంటకు నెల రోజులు మాత్రమే నీరు ఎక్కువగా అవసరం ఉంటుంది. జలాశయాలకు ఉన్న నీటి నిల్వలకు లీకేజీలను పూర్తిస్థాయిలో నిలువరించ గలిగితే వచ్చే యాసంగి పంటలకు ఢోకా ఉండదు. లేకుంటే యాసంగి సీజన్‌లో సాగునీటి కష్టాలు తప్పవు. ఎగువమానేరు జలాశయం షట్టర్ల ద్వారా లీకేజీల రూపంలో సుమారు వంద క్యూసెక్కుల నీరు వృథాగా పోతోంది. జలాశయం గరిష్ఠ నీటి నిల్వ రెండు టీఎంసీలకు పూర్తిస్థాయిలో ఉంది. దీని పరిధిలో 45 వేల ఎకరాల ఆయకట్టు ఉంది.


# రహదారి విస్తరణకు
# మార్గం సుగమం



**ధర్మపురి –నవభూమి:** రాయపట్నంలో భూ పరిశీలన చేస్తున్న అధికారులు నిజామాబాద్ – జగ్దల్‌పూర్ 63వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సర్వే పనులు ఇప్పటికే పూర్తిచేసిన అధికారులు..భూ సేకరణకు సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజల నుంచి అభిప్రాయాలు సైతం సేకరించారు. దీంతో తుది నోటిఫికేషన్ జారీకి రంగం సిద్ధం చేశారు. ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా.. మంచిర్యాల సెక్షన్ పరిధిలో 131.8 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు అధికారులు నిర్ణయించారు.మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, లక్షెట్టిపేట, హాజీపూర్ పట్టణాల గుండా గతంలో నిర్వహించిన సర్వేల ప్రకారం రహదారి నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండగా.. జనావాసాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, దుకాణ సముదాయాల కారణంగా అభ్యంతరాలు వెల్లువెత్తడంతో రహదారిని కొద్దిగా మార్పులు చేసి బైపాస్ చేశారు. ఇప్పటికే సర్వే పూర్తి కాగా భూ రికార్డుల్లో లోపాలను సవరించి తుది నోటిఫికేషన్ విడుదలకు రంగం సిద్ధం చేస్తున్నారు. పరిగణనలోకి పలు అంశాలు..రహదారి విస్తరణలో భాగంగా గత నెలలో ధర్మపురి, బుగ్గారం కేంద్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్ మణికుమార్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ప్రధానంగా పర్యావరణం, సామాజిక, ఆర్థిక అంశాలను పరిగణలోకి తీసుకొని నివేదికలను రూపొందిస్తున్నారు. కోల్పోనున్న 112 ఎకరాలు..బుగ్గారం మండలంలో సిరివంచకోట, బుగ్గారం, గోపులాపూర్, మద్దునూర్ గ్రామాల నుంచి.. ధర్మపురి పరిధి రాయపట్నం, స్తంభంపల్లి శివారు వరకు రహదారిని నిర్మించేలా రూపకల్పన చేశారు. దీంతో మొత్తం 112 ఎకరాల భూమిని రైతులు కోల్పోవాల్సి వస్తోందని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే రైతులకు ఇచ్చిన నోటీసుల్లో ఉన్న భూమికి, క్షేత్ర స్థాయిలో తేడా ఉందని రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అన్నదాతల ఆవేదన..రహదారి విస్తరణ సందర్భంగా తమ విలువైన భూములు కోల్పోతున్నందుకు రైతులు ఆందోళన చెందుతున్నారు. వీటి ధర బహిరంగ మార్కెట్‌లో ఎకరం కనీసం రూ.30 నుంచి రూ.40 లక్షల ధర పలుకుతోంది. ప్రభుత్వం పరిహారం పెంచాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు ఇంతకాలం భూమినే నమ్ముకొని జీవించిన తమకు ఉపాధి ఉండదని వాపోతున్నారు.లోపాలను సవరిస్తాం.. రైతుల నుంచి వచ్చిన భూ సాంకేతిక సమస్యలను పరిష్కరించి.. వారం, పది రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశముంది. అన్ని లోపాలను పూర్తిగా సవరిస్తాం. రైతుల నుంచి వచ్చిన ప్రతి విషయాన్ని పరిశీలించిన తర్వాతే నోటిఫికేషన్ జారీ చేస్తాం.

# నిధుల కోసం నిరీక్షణ

**జగిత్యాల –నవభూమి:** వరదకాలువ నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ ద్వారా జిల్లాలో పెద్దఎత్తున ఆయకట్టు స్థిరీకరణ పనులకు ఇటీవల అధికారులు ప్రతిపాదనలు పంపించగా నిధులు మంజూరు కావాల్సి ఉంది.ప్రతిపాదిత పనులకు నిధులు విడుదలచేసేలా ప్రజాప్రతినిధులు కృషిచేస్తే వేసవిలోపు పనులు ముగిసి వచ్చే వానాకాలం నుంచి జిల్లాలోని ఆయకట్టేతర ప్రాంత రైతులకూ లాభం కలిగే అవకాశముంది.ప్రతిపాదిత పనులు శ్రీరామసాగర్ మిగులు జలాలను దిగువకు తరలించేలా, దిగువనుంచి ఎల్లంపల్లి జలాలను శ్రీరామసాగర్‌లోకి ఎత్తిపోసేలా వినియోగిస్తున్న వరదకాలువకు అనుబంధంగా రూ.763.31 కోట్లతో పలు పనులకు ప్రతిపాదించారు. ఇందులో కథలాపూర్ మండలం దుంపేట వద్ద పంపుహౌస్ నిర్మించి 52.30 కి.మీ వద్ద ఓటీద్వారా నీటిని తీసుకుని కలికోట సూరమ్మ చెరువు, లక్మాకుల, తుమ్మల చెరువులను నింపాలి.రుద్రంగి చెరువు ప్రధాన కుడికాలువ కొత్తపేట, మోత్కురావుపేట వద్ద పంపుహౌస్‌లు నిర్మించి కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాల్లోని ఎల్లమ్మ తదితర చెరువులను నింపాలి.వరదకాలువ 47.600 కి.మీ వద్ద ఎడమకాలువ పంపుహౌస్ నిర్మాణంతో 14ఆర్ కాలువ నింపటం ద్వారా కథలాపూర్, మెట్పల్లి మండలాలకు నీరందుతుంది.76.22 కి.మీ మద్దుట్ల వద్ద పంపుహౌస్ నిర్మాణంతో కొత్తచెరువు నిండుతుంది. గొర్రెగుండం గుడిచెరువు వద్ద పంపుహౌస్‌తో నల్లమట్టు చెరువును నింపవచ్చు. ఈ ప్రధాన పనులతో పాటుగా కొడిమ్యాల మండలంలో పలు నిర్మాణాలు, వరదకాలువలో రంగాపూర్ వద్ద 3.5 కి.మీ లైనింగ్ తదితర పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు.రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీరణను రూ.136 కోట్లతో చేపట్టగా మిగులు పనులను పూర్తిచేయాలి. మిషన్ కాకతీయ పథకం ద్వారా అసంపూర్తి చెరువుల పునరుద్ధరణకు రూ.120 కోట్లవరకు నిధులను విడుదల చేయాల్సి ఉంది. దీనిపై నీటిపారుదలశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపాదిత నిర్మాణాలు,అవసరమున్న మరమ్మతుకు దశలవారీ గా నిధులు విడుదల అవుతాయన్నారు.జిల్లాలో 35 చెక్‌డ్యాంల నిర్మాణాన్ని తలపెట్టగా 11 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.57.07 కోట్ల నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఆయకట్టు పరిధిలో ఆపరేషన్,నిర్వహణ,మరమ్మతు నిమిత్తం 130 పనులకు అనుమతులు రాగా పనుల పూర్తికి ఇంకా రూ.17.41 కోట్లు విడుదల చేయాల్సిఉంది. వరదకాలువ 67.500 కి.మీ వద్ద కుడికాలువ పంపుహౌస్ నిర్మాణంతో 15ఆర్‌కాలువను నింపటంద్వారా మేడిపల్లి, జగిత్యాల, మల్యాల మండలాలకు నీరందుతుంది.ప్రధానంగా 8 పనులను రూ.805.31 కోట్లతో చేపట్టడం ద్వారా అదనంగా 54,215 ఎకరాల భూమికి సాగునీరంది ఆయకట్టు పరిధిలోకి వస్తుంది.59.500 కి.మీ వద్ద కుడికాలువ పంపుహౌస్ ద్వారా మేడిపల్లి, బీమారం, కథలాపూర్, కోరుట్ల మండలాలకు నీరు పారుతుంది.



## విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి



**పెద్దపల్లి –నవభూమి:** ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధ వారం కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్‌లో పాఠశాల విద్యపై ఓదెల మండల హెడ్‌మాస్టర్లతో సమీక్షిం చారు. ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమం అమలు, పాఠశాల లో విద్యార్థులు మానిటరింగ్, విద్యా బోధన విధానా లు, ప్రస్తుత విద్యా సంవత్సరం రూపొందించుకున్న లక్ష్యాలు మొదలగు వివరాలను కలెక్టర్ అడిగి తెలు సుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పాఠశాలలకు ఉపాధ్యాయులు సకా లంలో చేరుకునేలా సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హెడ్‌మాస్టర్‌లకు సూచించారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు ఆల స్యంగా హాజరవుతున్నారని ఎటువంటి ఫిర్యాదులు రావద్దని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు రెగ్యులర్‌గా హాజరుకావాలని, హాజరు తక్కువ ఉన్న విద్యార్థులపై శ్రద్ధ వహించి వారి ఇంటికి వెళ్లి ఫాలోఅప్ చేసే విధంగా చూడాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి కనీస విద్య ప్రమాణాలు అందే దిశగా కృషి చేయా లని కలెక్టర్ తెలిపారు. పాఠ్యాంశాన్ని విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా బోధించాలని, పాఠ శాలలో చదివే ప్రతి విద్యార్థి తెలుగు, ఆంగ్లంలో చదువడం, రాయడం, బేసిక్ మ్యాథ్స్ వంటి విద్య ప్రమాణాలు నేర్చుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమా వేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు, ఏ.ఎంవో డాక్టర్ పీఎం షేక్, ఓదెల మండలంలోని పాఠశాలల హెడ్ మాస్టర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమాచారమివ్వండి.. రూ.10వేలు పొందండి



**గోదావరిఖని, –నవభూమి:** సింగరేణి ప్రధాన కార్యాలయం సింగరేణిలో అవినీతికి తావులేకుండా పారదర్శక పాలన అందించేందుకు యాజమాన్యం దృష్టి సారించింది.ముఖ్యంగా మెడికల్ బోర్డు పేరుతో జరుగుతున్న అవినీతి దందాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టింది. అన్‌ఫిట్ చేయిస్తామని అమాయక కార్మికుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్న వారి సమాచారం సేకరించే పనిలో పడింది. దీనిపై సమాచారం ఇచ్చినవారికి రూ.10 వేల పారితోషికం కూడా అందించేందుకు నిర్ణయించింది. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపింది.సీఎండీ ప్రత్యేక శ్రద్ధ..మెడికల్ దందాకు అడ్డుకట్ట వేసేందుకు విజిలెన్సు విభాగం అధికారులను.. సంస్థ సీఎండీ బలరాం అప్రమత్తం చేశారు. వారితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రధానంగా మెడికల్ బోర్డు దందాపైనే ప్రస్తావించారు. సింగరేణి మెడికల్ బోర్డులో అన్‌ఫిట్ చేయించేందుకు అమాయకుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్‌ఫిట్ అయితే కార్మికుని స్థానంలో వారసునికి ఉద్యోగం వస్తుందన్న ఆశతో.. చాలామంది కార్మికులు మెడికల్ బోర్డు పరీక్షలకు వెళ్లే ముందు పైరవీకారుల ఉచ్చులో పడుతున్నారు. వారికి భారీ మొత్తంలో డబ్బులు చెల్లిస్తున్నారు.ఒకవేళ అన్‌ఫిట్ కాని కార్మికుని నుంచి వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇచ్చేందుకు దళారులు తిప్పుకుంటున్నారు. కొద్దిరోజుల తర్వాత కొంత మొత్తం మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో కార్మికులు ఇలాంటి దళారుల చేతిలో మోసపోతుండటంతో ఈ వ్యవహారంపై సింగరేణి ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ దందాలో ఉన్నవారిని బయటకు తీసేందుకు రహస్యంగా సమాచారం సేకరించే పనిలో పడింది.సింగరేణిలో మెడికల్ దందాపై సీబీడీ ఇచ్చిన నివేదికలపై చర్యలు తీసుకోవడానికి యాజమాన్యం సిద్ధమవుతుంది. ఇదివరకే అవినీతి నిరోధక శాఖ విచారణ చేపట్టింది. దీంతోపాటు సీబీడీ కూడా మెడికల్ బోర్డులో జరుగుతున్న అవినీతి దందా.. పైరవీకారులు, దళారుల వివరాలు సేకరించి, నివేదికలను సింగరేణికి అప్పగించింది. ఇందులో సంస్థలో పనిచేస్తున్న వారైతే ఉద్యోగాల నుంచి తొలగించేందుకు కూడా వెనుకాడకుండా నిర్ణయం తీసుకునే అవకాశముంది.

# పగలు వెలుగులు.. రాత్రిళ్లు చీకటి

**కరీంనగర్ –నవభూమి:** రామగుండం బైపాసు రోడ్డులో వెలగని కేంద్రీకృత వీధి దీపాలు కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గతేడాది నుంచి ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్‌–ఎల్) పర్యవేక్షణ పూర్తిగా అటకెక్కింది. ఇంకేముంది అన్ని డివిజన్ల ఫిర్యాదుల సంఖ్య పెరిగిపోతుండగా మరమ్మతులు చేయాల్సిన సదరు సంస్థ నామమాత్రంగా పనులు చేసి పత్తా లేకుండా పోయింది. అరకొర సామగ్రి పంపిణీ చేస్తుండగా కొద్ది నెలలుగా అదేది కూడా అందించకపోవడంతో బల్దియా సిబ్బంది నానావస్థలు పడుతున్నారు. ఇటీవలె వర్షాలు పడటంతో చిన్న, చిన్న సమస్యలతో కొన్ని చోట్ల రోజుల తరబడి ఎల్‌ఈడీ వీధిపాలు వెలగక చీకటిగా ఉంటుంది.రోజుకు 140 ఫిర్యాదులు నగరవ్యాప్తంగా రోజుకు సుమారు 140 వీధి దీపాలు వెలగడం లేదనే ఫిర్యాదులు అందుతున్నాయి. ఇప్పటి వరకు 60 డివిజన్‌లలో కలిపి సుమారు 400 వీధి దీపాలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. నిర్వహణ సంస్థ నాలుగు రకాల కంపెనీల లైట్లు ఏర్పాటు చేయడంతో ఒక దానికి మరోదానికి పొంతన లేకపోవడంతో పలు చోట్ల అంధకారం నెలకొంది. గత్యంతరం లేక నగరపాలిక సిబ్బంది వీధి దీపాలను సర్దుబాటు చేసుకుంటూ ఫిర్యాదులను పరిష్కరిస్తున్నారు. కనీసం వెయ్యి లైట్లు అవసరముండగా ఒక్కటీ లేకపోవడంతో సమస్యలు వస్తున్నాయి. ఇష్టానుసారంగా..ఎల్‌ఈడీ వీధి దీపాలు ఒకప్పుడు టైమర్స్‌తో వెలిగేవి. అవే బంద్ అయ్యేవి. నగరవ్యాప్తంగా 150 సీసీఎంఎస్ బాక్స్‌లు, టైమర్స్ దెబ్బతిన్నాయి. సెన్సార్లు, బ్రేకర్లు, రిలేలు పని చేయడం లేదు. వీధుల్లో దీపాలు



ఇష్టానుసారంగా వెలుగుతున్నాయి. కొన్నిచోట్ల ఉదయం 9 వరకు వెలుగుతుండగా సాయంత్రం 5 గంటలకే వెలుతురు వస్తుందని, కొన్ని చోట్ల రాత్రి 9 వరకు దీపాలు వేయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి.నగరంలోని పలు కాలనీల్లో ఇలా పొద్దంతా దీపాలు వెలుగుతున్నాయి..స్మార్ట్, సుడా సంగతేంటి? స్మార్ట్‌సిటీలో ఎన్ని స్తంభాలు వేశారు? ఎన్ని లైట్లు బిగించారనే విషయం ఇప్పటికి బల్దియాకు అప్పగించడం లేదు. నగరంలో సుమారు వంద టైమర్స్ పని చేయకపోవడంతో ఆ లైట్లు వెలగడం లేదు. నాణ్యత లేని వీధి దీపాలు బిగించడంతో మూడు నెలలకే కాలిపోతున్నాయని తెలిసింది. బల్దియా ద్వారా బిగించిన ఎల్‌ఈడీ లైట్లు ఏళ్లు గడుస్తున్నా అలాగే వెలుగుతున్నాయని చెబుతున్నారు. సుడా ద్వారా ఏర్పాటు చేసిన వీధిలైట్ల పరిస్థితి అలాగే మారింది. సుడా, స్మార్ట్‌సిటీకి సంబంధించిన వీధి దీపాలకు ముందస్తుగా సామగ్రితో సహా అప్పగించాల్సి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బకాయిల భారం రూ.7 కోట్లు నగరంలో ఎల్‌ఈడీ వీధిలైట్ల ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఈఈఎస్‌ఎల్ నిర్వహిస్తోంది. దేశంలోని స్థానిక సంస్థల నుంచి ఈ సంస్థకు బకాయిలు పేరుకుపోయాయి. రాష్ట్రంలోని పలు పుర, నగరపాలికల నుంచి కూడా చెల్లింపులు లేకపోవడం, రూ.కోట్లు పేరుకుపోవడంతో సదరు సంస్థ చేతులెత్తేసినట్లుగా తెలుస్తోంది. కరీంనగర్ నగరపాలక సంస్థ మూడేళ్లుగా రూ.7 కోట్ల బకాయి పడటంతో ఆ సంస్థకు చెందిన ఉద్యోగులను క్రమేనా జీతాలు ఇవ్వడం మానేసింది. ఇక్కడ పని చేసే వారు ఇంటిదారి పట్టారు. ఈ కాంట్రాక్టు గడువు కూడా మరో మూడు నెలలు మాత్రమే ఉన్నట్లుగా చెబుతున్నారు. నెలకు రూ.25 లక్షల చొప్పున చెల్లిస్తే ఈ సమస్యనే జఠిలంగా మారేది కాదని పలువురు పాలకవర్గ సభ్యులు అంటున్నారు. ఫిర్యాదులను పరిష్కరిస్తామని, ఏజెన్సీ తీరును మేయర్, అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఇన్‌ఛార్జి డీఈఈ అయూబ్‌ఖాన్ తెలిపారు.

# పర్యావరణహిత అడుగులు

**కరీంనగర్ –నవభూమి:** కరీంనగర్‌లో ఓ షోరూం వద్ద ఈవీ ఛార్జింగ్ పాయింట్ పర్యావరణ హితం కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహలందిస్తున్నాయి.. పెరుగుతున్న కాలుష్యం, భారంగా మారిన ఇంధన ధరలు తదితర కారణాలతో వాహనదారులూ వాటి వైపు మొగ్గు చూపుతున్నారు.. ఈ క్రమంలో ఈవీ కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోల విక్రయాలు పెరగ్గా అదే స్థాయిలో ఛార్జింగ్ కేంద్రాలు లేకపోవడం మాత్రం సమస్యగా మారింది.ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 7,565 ఎలక్ట్రిక్ వాహనాలు ఆయా ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ అయి ఉన్నాయి. 2020లో 46 ఎలక్ట్రిక్ వాహనాలు ఉండగా, 2021లో వాటి సంఖ్య 532కు చేరుకోగా ప్రస్తుతం 7,565 ఉండటం గమనార్హం. వీటిలో ద్విచక్ర వాహనాలే ఎక్కువ. గ్రామాల్లోనూ ఈ–బైక్‌ల వినియోగం పెరిగింది. వీటిని కొనుగోలు చేసిన వారికి జీవితాల పన్నుతోపాటు రిజిస్ట్రేషన్ ఛార్జీల విషయంలో ప్రభుత్వం మినహాయింపునిస్తూ ప్రోత్సహిస్తోంది. గడువు ముగిసిన వాహనాలను తుక్కు కింద మార్చి ఆ సర్టిఫికెట్ చూపిస్తే దానిపై కూడా కొంత వరకు రాయితీ లభిస్తుంది.సమస్యలున్నాయి..ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్నా ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో లేవు. ప్రభుత్వ పరంగానూ ఏర్పాటు చేయలేదు.ప్రస్తుతమున్న ఈవీ కార్లలో చాలా వాటి బ్యాటరీ సామర్థ్యం తక్కువ. వాహనదారుడు కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి రావాలంటే మధ్యలో ఛార్జింగ్ చేయించాల్సిందే. ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో తీసుకెళ్లలేని పరిస్థితి. దీంతో ఎక్కువ మంది దూర ప్రాంతాలకు ఇంధన వాహనాలను వినియోగిస్తూ సమీప ప్రాంతాలకు ఈవీలను ఉపయోగిస్తున్నారు.సాధారణ వాహనాలతో పోల్చుకుంటే ఖరీదు ఎక్కువగా ఉండటం, బ్యాటరీ జీవితకాలం పూర్తయితే కొత్తది మార్చుకోవడానికి అధిక ధర వెచ్చించాల్సి రావడం చాలా మందిని వెనుకడుగు వేసేలా చేస్తోంది.ఈవీ కారు యజమానులు ఇంటి వద్దే తమ వాహనాలను ఛార్జింగ్ చేసుకుంటున్నారు. ఛార్జింగ్ కోసం ఆయా కంపెనీలు ప్రత్యేక పరికరం ఇస్తున్నాయి.సొంత ఇల్లు ఉన్నవారికి అయితే ఛార్జింగ్ పాయింట్ కోసం ఇంటి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేసుకోవచ్చు. అద్దెకు ఉన్న వారికి మాత్రం ఇది ఇబ్బందిగా మారింది. ఇంటిలో పై అంతస్తులో ఉన్నవారిదీ ఇదే పరిస్థితి.అక్కడక్కడ ఉన్నా....ఈవీ వాహనాల సంఖ్య పెరుగుతుండటంతో కొందరు హోటళ్లు, షోరూంల వద్ద ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు.వాహనం ఛార్జింగ్ కావడానికి సమయం ఎక్కువగా తీసుకుంటుంది. దీంతో హోటళ్లు, షోరూంల వద్ద గంటల కొద్దీ ఉండటానికి ఎవరూ ఇష్టపడటం లేదు.ఇలా చేస్తే మేలు..ఛార్జింగ్ స్టేషన్లను విరివిగా ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.బ్యాటరీల సామర్థ్యం పెంచేలా, ఛార్జింగ్ సమయం తగ్గించేలా కంపెనీలకు సూచనలివ్వాలి.

